సాక్షి విశాఖపట్నం

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023




అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

వరాహ లక్ష్మీ నృసింహస్వామిని కేంద్ర ప్రభుత్వ కన్స్యూమర్ అఫైర్స్ సెక్రటరీ రోహిత్ కుమార్ సింగ్ దర్శించుకున్నారు. 8లో



పోర్టులో లోకోమోటివ్ సేవలు

అదానీ గంగవరం పోర్టులో అధునాతన లోకోమోటివ్ సేవలు ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు. 8లో



పలు రైళ్ల గమ్యం కుదింపు

కేకే లైన్‌లో రైల్వే ట్రాక్‌పై కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో పలు రైళ్ల గమ్యం కుదించారు. 8లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదాల నివారణకు యాక్షన్ ప్లాన్



మాట్లాడుతున్న డీసీపీ-1 కె.శ్రీనివాసరావు

దొండపర్తి: నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డీసీపీ-1 కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ప్రత్యేక దృష్టి సారించారని, దీనిపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించినట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాలలో అదనపు ట్రాఫిక్ సిబ్బంది నియమించడంతో పాటు రోడ్డు భద్రతకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ర్యాష్ డ్రైవింగ్, రేసింగ్ చేస్తే 9493336633 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ ద్వారా సమాచారం అందించాలన్నారు.

బుల్లయ్య కళాశాలతో సీఎస్‌సీ అకాడమీతో ఒప్పందం



ఒప్పంద పత్రాలను ఇచ్చి పుచ్చుకుంటున్న కళాశాల, సీఎస్‌సీ ప్రతినిధులు

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సీఎస్‌సీ అకాడమీ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా కళాశాలలోని విద్యార్థులు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కోసం ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ప్లాట్‌ఫాంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఒప్పందంతో 1500 మంది విద్యార్థులు, అధ్యాపకులు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతపై మరింత అవగాహనకు వీలుకలుగుతుంది.ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ సమక్షంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్‌చౌదరి, సీఎస్‌సీ అకాడమీ ప్రతినిధి వి.ఎల్.ఈ.వై రామ్మోహనరావు ఎంవోయూపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, కె.సోమేశ్వర రెడ్డి, అని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పోర్టులో స్పెషల్ క్యాంపెయిన్ 3.0



విశాఖపట్నం పోర్టు కార్యాలయ ముఖ ద్వారం

సాక్షి, విశాఖపట్నం : పోర్టు పరిధిలో స్వచ్ఛత సూచీని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు స్పెషల్ క్యాంపెయిన్ 3.0ని ప్రారంభిస్తున్నట్లు పోర్టు చైర్మన్ డా.అంగముత్తు, కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 31వ తేదీ వరకూ ఈ స్పెషల్ క్యాంపెయిన్ జరగనుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పోర్టులోని అన్ని విభాగాలలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పా ట్లు చేశామన్నారు. పోర్టులో స్వచ్ఛతా ప్రమాణాలను మెరుగు పరచడంతో పాటు సాధారణ ప్రజలతో మమేకం అయ్యేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్లమెంట్ సభ్యుల సూచనలు, రాష్ట్ర ప్రభుత్వ సలహాలు, మూడు నెలల కంటే ఎక్కువ సమయం పెండింగ్‌లో ఉన్న పార్లమెంటరీ హామీలు, ప్రధాన మంత్రి కార్యాలయ సూచనలు, పబ్లిక్ గ్రీవెన్స్‌లు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను ప్రధానంగా చేపట్టనున్నామని వెల్లడించారు. అక్టోబర్ 1వ తేదీన డాక్ ఏరియాలో చేపట్టనున్న భారీ స్వచ్ఛతా కార్యక్రమం ద్వారా ఈ స్పెషల్ క్యాంపెయిన్ 3.0 ను ప్రారంభించనున్నామని వివరించారు.

వైఎస్ జగన్‌పై దాడి కేసు 13కి వాయిదా

అల్లిపురం : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు మరోసారి వాయిదా పడింది. 3వ అదనపు జిల్లా జడ్జి, ఏసీబీ, ఎన్ఐఏ కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్‌వీవీఎస్.మురళీకృష్ణ వచ్చే నెల 13వ తేదీకి కేసు వాయిదా వేశారు. ఈ కేసును విజయవాడ ఎన్.ఐ.ఏ కోర్టు నుంచి విశాఖపట్నం జిల్లా కోర్టు ఆవరణలో గల 3వ అదనపు జిల్లా జడ్జి, ఏసీబీ, ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావును శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు.

'ఆరోగ్య సురక్ష'కు సర్వం సిద్ధం



- జిల్లాలో 1,85,612 ఇళ్లలో పూర్తయిన సర్వే
- నేడు అర్బన్, రూరల్‌లో మూడేసి వైద్య శిబిరాల నిర్వహణ
- అందుబాటులో స్పెషలిస్టు వైద్యులు

మహారాణిపేట: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణకు సర్వం సిద్ధమైంది. శనివారం నుంచి నెల రోజుల పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఇప్పటికే ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏఎన్‌ఎంలు, నర్సింగ్ విద్యార్థులు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల యోగక్షేమాలు ఆరా తీశారు. జిల్లాలో మొత్తం 1,85,612 ఇళ్లలో సర్వే పూర్తి చేశారు. 4,96,412 మందిని కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, వివరాలు నమోదు చేశారు.

నేటి నుంచి శిబిరాలు

ఆరోగ్య సురక్ష శిబిరాలు శనివారం నుంచి జరగనున్నాయి. అర్బన్‌లో మూడు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు చోట్ల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మొత్తమ్మీద అర్బన్‌లో 54, గ్రామీణ ప్రాంతాల్లో 64 వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

హాజరయ్యే వైద్యులు

ఆరోగ్య సురక్ష శిబిరాలకు జనరల్ ఫిజిషియన్, డెంటల్, గైనిక్, పిల్లల వైద్యులు, కంటి వైద్యుడు హాజరు కానున్నారు. వీరితో పాటు నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన పరీక్షలతో పాటు 120 రకాల మందులు అందజేస్తారు. అవసరమైన వారికి కళ్లద్దాలు కూడా ఉచితంగా అందజేయనున్నారు.

కలెక్టర్ అధ్యక్షతన కమిటీ

జిల్లాలో ఈ కార్యక్రమం అమలు కోసం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్‌కిషోర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.రాజేష్ ఉన్నారు. అలాగే ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించారు. జిల్లాలో 542 మంది ఏఎన్‌ఎంలు, 909 మంది ఆశా వర్కర్లు, 9 నర్సింగ్ కాలేజీల నుంచి 598 మంది విద్యార్థులు ప్రత్యేక శిబిరాల్లో పాల్గొంటారు.

నేడు జరిగే శిబిరాలు

- మధురవాడ పీహెచ్‌సీ
- గాజువాక పీహెచ్‌సీ
- భీమిలి మండలం చేపలుప్పాడ (దండుబజార్) పీహెచ్‌సీ
- పెందుర్తి మండలం పినగాడి వైఎస్సార్ హెల్త్ క్లినిక్
- ఆనందపురం వైఎస్సార్ హెల్త్ క్లినిక్
- పద్మనాభం మండలం కొవ్వాడ వైఎస్సార్ హెల్త్ క్లినిక్

జిల్లాలో ఆరోగ్య సురక్షలో ఈ నెల 27 వరకు చేసిన పరీక్షలు

కేటగిరీ	పరీక్షల సంఖ్య
బీపీ	1,84,628
మధుమేహం	1,88,065
హిమోగ్లోబిన్	1,86,037
యూరిన్ పరీక్షలు	420
కఫం పరీక్షలు	4396
డెంగ్యూ	472
మలేరియా	3126

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నాం. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. శిబిరాల్లో పాటించాల్సిన నియమ, నిబంధనలను సిబ్బందికి తెలియజేశాం.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో, విశాఖపట్నం

ప్రతి శిబిరంలో ఐదుగురు వైద్యులు



వైద్య శిబిరాలకు అవసరమైన వైద్యులను నియమించాం. అర్బన్‌లో 54, రూరల్‌లో 64 వైద్య శిబిరాలు నిర్వహించనున్నాం. ప్రతి హెల్త్ క్యాంప్‌లో ఐదుగురు వైద్యులు అందుబాటులో ఉంటారు. స్పెషలిస్టు వైద్యుల్లో గైనిక్, పీడియాట్రిక్, డెంటల్, జనరల్ ఫిజిషియన్, కంటి వైద్యులు హాజరవుతారు.

– డాక్టర్ రమేష్‌కిషోర్, సమన్వయ అధికారి, ఏపీ వైద్య విధాన పరిషత్

21,134 మందికి రూ.21.13 కోట్ల లబ్ధి

ఐదోసారి వాహనమిత్ర నిధులు విడుదల



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున ఇతర అధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్ పర్సన్లు

మహారాణిపేట: వరుసగా ఐదోసారి వాహనమిత్ర నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. శుక్రవారం ఆయన విజయవాడ విద్యాధరపురం నుంచి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

వాహనమిత్రతో సొంత ఆటో, మినీ క్యాబ్ డ్రైవర్లకు రూ.10 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాలో జమచేస్తూ ఆర్థిక భరోసా ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి వాహన మిత్ర పథకం కింద 21,134 మంది లబ్ధిదారులకు రూ.21.13 కోట్లు ఆర్థిక సాయం అందించడం ద్వారా విశాఖ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. అనంతరం కలెక్టరు ప్రజాప్రతినిధులతో కలిసి వాహన మిత్ర చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెట్రో కెమికల్ అథారిటీ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, జాయింట్ రవాణా కమిషనరు వడ్డీ సుందర్, ఉప రవాణా కమిషనరు రాజరత్నం, రవాణా శాఖ అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గొప్ప మనసు చాటుకుంటున్నారు



పాదయాత్రలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పించి గొప్ప మనసు చాటుకుంటున్నారు. అంతేకాకుండా నాకు ఇంటి పట్టా ఇచ్చారు. అమ్మఒడి పథకం కింద రూ.15వేలు ఇచ్చారు. నా కుటుంబానికి ప్రభుత్వ నుంచి ఎన్నో పథకాలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పేదల మనిషి అని రుజువు చేసుకుంటున్నారు.

– శ్రీయల హరి రాము, ఆటో డ్రైవర్, గాజువాక

చాలా ఆనందంగా ఉంది



నాకు వరుసగా 5వ ఏడాది వాహన మిత్ర పథకం కింద రూ.10వేలు ఆర్థిక సాయం అందడం ఆనందంగా ఉంది. ఈ డబ్బులతో వాహనానికి మరమ్మతులు చేయించుకుంటా. నా భార్య వలంటీరుగా పని చేస్తోంది. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు దరిచేరుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం పేదల కోసం ఆలోచించి పాలన సాగిస్తున్నారు. ఆయనకు మా అందరి తరుపున కృతజ్ఞతలు.

– కె.రాంబాబు, ఆటో డ్రైవర్, మల్కాపురం

16న విశాఖకు సీఎం జగన్

'ఇన్ఫోసిస్'ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, ఇన్ఫోసిస్ ప్రతినిధులు

దొండపర్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వచ్చేనెల 16న విశాఖకు రానున్నారు. ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో ప్రభుత్వ అతిథి గృహంలో సమీక్షించారు. ఇన్ఫోసిస్ ప్రారంభోత్సవ కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ఈ సమీక్షలో ఇన్ఫోసిస్ మౌలిక సదుపాయాల విభాగ ప్రాంతీయ అధికారి కులకర్ణి, ఇండియా హెడ్ పునీత్ దేశాయ్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండప్రాంతాల్లో హెలికాప్టర్ల ద్వారా సీడ్‌బాల్స్



ఐఎన్ఎస్ దేగా వద్ద జీవీఎంసీ కమిషనర్‌తో చర్చిస్తున్న నేవల్ అధికారులు



విత్తన బంతులు తయారు చేస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

- నేవల్ అధికారుల సహకారంతో పచ్చదనం పెంపు
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నగరంలోని పలు కొండలపై సీడ్ బాల్స్ (విత్తన బంతుల) ను హెలికాప్టర్ ద్వారా జార విడిచేందుకు నేవల్ అధికారుల సహకారం తీసుకుంటున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. నగరంలో పచ్చదనం పెంపునకు ఈ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఐఎన్ఎస్ డేగాలో నేవల్ అధికారులు కమాండో దీపక్ సింగ్, కెప్టెన్ రాజ్‌కుమార్ సద్దార్‌లతో జీవీఎంసీ కమిషనర్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని నగర పరిధిలోని 7 కొండలపై విత్తన బంతులు జార విడిచేందుకు చర్యలు చేపట్టనున్నట్టు కమిషనర్ తెలిపారు. జోన్-1 పరిధిలోని 3, 4 వార్డుల్లో భీమిలి పావురాల కొండ ప్రాంతంలో రెండు చోట్ల, కాపులుప్పాడకొండ, జోన్-3, 5 పరిధిలోని 9, 12, 14, 45 వార్డుల పరిధిలో సింహాచలం కొండ, జోన్-8 పరిధి 92, 94, 95 వార్డుల్లో మేఘాద్రిగెడ్డ వద్ద ఉన్న పార్లు పాలెం కొండ, జోన్-6 పరిధి 64, 88 వార్డుల్లోని వెదుర్ల నవర కొండ, యారాడ కొండలపై విత్తనాలు జారవిడిచేందుకు నేవల్ అధికారులతో చర్చించామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగులకు విత్తన బంతుల పంపిణీ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ ఆవరణలో శుక్రవారం దేశీయ అడవి విత్తనాలను ఉపయోగించి, మట్టి, పేడ కలిపిన విత్తన బంతులను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి స్వయంగా తయారు చేసి, జీవీఎంసీ ఉద్యోగులకు పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ నగరంలోని కొండలపై సుమారు 2 లక్షల విత్తన బంతులను హెలికాప్టర్ ద్వారా జారవిడుస్తున్నామన్నారు. ఔషధ గుణాలు గల 30 రకాల జాతులకు చెందిన విత్తనాలతో విత్తన బంతులను తయారు చేశామని, వీటి ద్వారా పశుపక్ష్యాదులే గాక సమస్త జీవరాశులకు ఆహారం, వసతి, ఆరోగ్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ(ఆర్) ఫణిరామ్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఏక్ తారీఖ్–ఏక్ గంట' శ్రమదానానికి సిద్ధం

డాబాగార్డెన్స్: స్వచ్ఛ భారత్ అభియాన్ పిలుపు మేరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ చేపడతున్న ఏక్ తారీఖ్-ఏక్ గంట శ్రమదానానికి సిద్ధమవుదామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శుక్రవారం నగర పౌరులకు పిలుపునిచ్చారు. 1న ఏక్ తారీక్-ఏక్ గంట్ పరిశుభ్రత కార్యక్రమం రుషికొండ, ఆర్కే బీచ్ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, మేయర్, డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్‌లీడర్లు, కార్పొరేటర్లు, జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, నగర పోలీస్ అధికారులు పాల్గొంటున్నారన్నారు. నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలన్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- ముస్లిం మైనార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం



వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ముస్లిం నాయకులు

పెదగంట్యాడ: ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గాజువాక నియోజకవర్గంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గాజువాక నియోజకవర్గ ముస్లిం మైనార్టీ మసీద్ అండ్ అసోసియేషన్ ప్రతినిధులు ఎండీ గౌస్, మహ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ (ఆత్మీయ సమావేశం) కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వైవీ సుబ్బారెడ్డి మాట్లాడారు.

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణం చేసిన నాటి నుంచి ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ముస్లిం మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని కొనియాడారు. రాజశేఖరరెడ్డి తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే బాటలో నడుస్తూ ముస్లింలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. మైనార్టీల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ముస్లిం కుటుంబాల్లోని పేదపిల్లలకు షాదీ తోఫా అందిస్తున్నారని వివరించారు. అలాగే ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే హజ్ యాత్రకు కూడా ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. గాజువాక నియోజకవర్గంలో షాదీఖాన నిర్మించడంతో పాటు నాలుగు నుంచి ఐదు మసీదులు నిర్మించుకునేందుకు స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ రాజీవ్‌నగర్‌లో ఈద్గా విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. బీహెచ్‌పీవీ వద్ద గల బరియల్ గ్రౌండ్‌లో అభివృద్ధి పనులు చేశామన్నారు. బీసీ రోడ్డులోని ఈద్గాను కూడా విస్తరిస్తామని, అలాగే షాదీఖాన కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, బొడ్డు నర్సింహపాత్రుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా చినతల్లి, నాయకులు ధర్మాల శ్రీను, గుడివాడ లతీష్, బోగాది సన్నీ, బొడ్డ గోవింద్, మైనార్టీ నాయకులు ఫారూఖీ, లుక్మాన్, ఇర్ఫాన్, దుబాయ్ భాషా, ఇక్బాల్, సర్దార్, మోతి, సాహిద్, నియోజకవర్గంలోని 19 మసీదులకు చెందిన మత పెద్దలు పాల్గొన్నారు.

రూ.95 కోట్లతో కేజీహెచ్ అభివృద్ధి



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట: కింగ్‌జార్జి ఆస్పత్రి అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేజీహెచ్ అభివృద్ధికి ప్రభుత్వ అధిక నిధులు కేటాయిస్తోంద న్నారు. ఎంఆర్ఐ స్కానింగ్, సీటి స్కాన్ పరికరం ఆస్పత్రికి చేరుకున్నాయని, మరో కొద్ది రోజుల్లో ఈ పరికరాలు వినియోగంలోకి తీసుకురానున్నామన్నారు. మొత్తం రూ.95 కోట్లతో అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. రూ.20 కోట్లతో క్యాన్సర్ యూనిట్ పరికరాలు కేజీహెచ్‌కు రానున్నాయన్నారు. సోలార్ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాధాకృష్ణ, డాక్టర్ వాణి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌సీటీసీ ప్రత్యేక విమాన ప్యాకేజీలు

తాటిచెట్లపాలెం: కేరళ, గోవాలోని పర్యాటక ప్రాంతాల సందర్శనార్థం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక విమాన ప్యాకేజీలను ప్రవేశపెట్టినట్టు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ చంద్రమోహన్ బిసా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా టూర్ వివరాలిలా ఉన్నాయి.

- కేరళ టూర్ వచ్చేనెల 14న విశాఖపట్నంలో ప్రారంభమై 19వ తేదీన ముగుస్తుంది. ఈ యాత్ర మొత్తం 5 రాత్రులు, 6 పగళ్లు ఉంటుంది. కేరళ కొచ్చిలోని డచ్ ప్యాలస్, సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి, సాంతా క్రూజ్ బాసిలికా, మున్నార్‌లోని ఎరావికుళం నేషనల్ పార్క్, మట్టుపెట్టి ఆనకట్టు, ఈకో పాయింట్, కుందల డ్యాం లేక్, అలెప్పీలో హౌస్‌బోట్‌లో రాత్రి బస, త్రివేండ్రంలో అజిమల టెంపుల్, శ్రీపద్మనాభస్వామి టెంపుల్ వంటి ప్రఖ్యాత సందర్శనీయ స్థలాలను వీక్షించవచ్చు. ఎకానమి క్లాస్ ఎయిర్ టికెట్, ఏసీ 3స్టార్ హోటల్ వసతి, 5 అల్పాహారాలు, 5 డిన్నర్‌లు, సైట్ సీయింగ్, ట్రావెల్ ఇన్సూరెన్స్, పన్నులతో కలిపి ఈ టూర్‌లో ఒక్కొక్కరికి రూ.56,635(సింగిల్ ఆక్యుపెన్సీ), రూ.40,925(డబుల్ ఆక్యుపెన్సీ), రూ.38,110(త్రిబుల్ ఆక్యుపెన్సీ) అవుతుంది.
- గోవా యాత్ర వచ్చేనెల 20న విశాఖపట్నంలో ప్రారంభమై 24న ముగుస్తుంది. ఈ యాత్ర మొత్తం 4 రాత్రులు, 5 పగళ్లు ఉంటుంది. ఉత్తర గోవాలోని అగోడా ఫోర్ట్, కండోలిమ్ బీచ్, బాగా బీచ్, అంజున బీచ్, వాగటర్ బీచ్, చపోరా ఫోర్ట్‌లతో పాటు డిన్నర్, దక్షిణ గోవాలోని ఓల్డ్ గోవా చర్చి(బాసిలికా ఆఫ్ బామ్ జీసస్, ఆర్కియాలజికల మ్యూజియం, పోర్ట్రయిట్ గ్యాలరీ), వేక్స్ వరల్డ్ మ్యూజియం, శ్రీమంగేషి ఆలయం, మిరామర్ బీచ్, మండోవి నదిపై బోట్ విహారం వంటి స్థలాలను వీక్షించవచ్చు. ఎకానమి క్లాస్ ఎయిర్ టికెట్, ఏసీ 3స్టార్ హోటల్ వసతి, అల్పాహారాలు, డిన్నర్‌లు, సైట్ సీయింగ్, ట్రావెల్ ఇన్సూరెన్స్, పన్నులతో కలిపి ఈ టూర్‌లో ఒక్కొక్కరికి రూ.39,010(సింగిల్ ఆక్యుపెన్సీ), రూ.28,750(డబుల్ ఆక్యుపెన్సీ), రూ.27,640(త్రిబుల్ ఆక్యుపెన్సీ) అవుతుంది. పూర్తి వివరాలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా లేదా 0891–2500695, 82879 32318, 92814 95847 నంబర్లలో గానీ సంప్రదించాలని చంద్రమోహన్ కోరారు.

ఆర్పీలకు ఫోన్లలో ఓ వ్యక్తి వేధింపులు

పీఎంపాలెం: మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్ల(ఆర్పీ)ను ఓ వ్యక్తి ఫోన్లు చేసి వేధిస్తున్నాడు. దీనిపై వారంతా పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. జీవీఎంసీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానని మధురవాడ పరిధిలోని ఆర్పీలకు తరచూ ఓ ఫోన్ నంబర్ నుంచి కాల్ వస్తోంది. టిడ్కో హౌసింగ్ కేటాయింపులు? ఇంత వరకు ఎంత మందితో డీడీలు కట్టించారు? కేటాయించిన వారిలో చనిపోయిన వారి ఫోన్ నంబర్లు ఏమిటి? మీరు ఎప్పుడు ఖాళీగా ఉంటారు? మీ ఇంట్లో ఎవరెవరు ఉంటారు? మీ భర్తలు ఏం చేస్తున్నారు? ఏ టైమ్‌లో బయటకు వెళతారు? మీతో పర్సనల్‌గా మాట్లాడాలి అంటూ అసభ్య పదజాలంతో అతను వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జోన్-2 ఏపీడీ, పీడీల దృష్టికి తీసుకెళ్లామని, వారి సూచనలతో పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆర్పీలు తెలిపారు. ఆర్పీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఫోన్ నంబర్, కాల్ డేట్ ఆధారంగా దర్యాప్తు జరిపించి, తగు చర్యలు తీసుకుంటామని సీఐ వై.రామకృష్ణ తెలిపారు.

గంజాయితో యువకుల అరెస్ట్

సీతమ్మధార: గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను టాస్క్‌ఫోర్స్ అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వివరాలివీ.. రైల్వే న్యూకాలనీలోని శ్రీనివాస కల్యాణ మండపం సమీపంలో శుక్రవారం గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ నేతృత్వంలో సిబ్బంది సోదాలు చేశారు. కేరళకు చెందిన సంసర్‌హల్, మహమ్మద్ షఫీతో పాటు విశాఖకు చెందిన భానుప్రసాద్, పెదబయలు మండలం పెదకోటపల్లికి చెందిన మత్స్యరాజును అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నాలుగు కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఫోర్త్‌టౌన్ పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పటిష్టంగా జగనన్న ఆరోగ్య సురక్ష

- నేటి నుంచి వైద్య శిబిరాలు
- జిల్లా ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జిల్లా ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు

మహారాణిపేట/డాబాగార్డెన్స్: జిల్లాలో పటిష్టంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టాలని జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో జనసాంద్రత అధికంగా ఉన్నందున వలంటీర్లు, ఏఎన్ఎంలు ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. మురికివాడల్లో నివసిస్తున్న ప్రజల పట్ల మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. జీవీఎంసీ పరిధిలో 72 చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం మధురవాడ, గాజువాక, చేపలుప్పాడలోని ఆరోగ్య కేంద్రాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. దంత, కళ్లు, బాలింతలు, గర్భిణులు, బీపీ, షుగర్, ఎముకలు సంబంధిత వైద్యులు ఈ శిబిరంలో పాల్గొంటారని చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శనివారం నుంచి అక్టోబర్ 30 వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరాల వద్ద ఇద్దరు స్పెషలిస్టులు, మరో ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు ఉంటారన్నారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు.. వలంటీర్లతో సహకారంతో జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు పంపిణీ చేయాలని, సర్వే వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి శిబిరం వద్ద 108 అంబులెన్సులను అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది వారికి కేటాయించిన తేదీల్లో శిబిరాల్లో పాల్గొనాలని ఆదేశించారు. ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.విశ్వామిత్ర, ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల జిల్లా సమన్వయాధికారి డాక్టర్ రమేష్ కిశోర్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, విజయలక్ష్మి, శివప్రసాద్, ఆర్జీవీ కృష్ణ, సింహాచలం, మల్లయ్యనాయుడు, డీపీవో చక్రవర్తి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఉన్నతాధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామిని శుక్రవారం కేంద్ర ప్రభుత్వ కన్స్యూమర్ అఫైర్స్ సెక్రటరీ రోహిత్ కుమార్ సింగ్(ఐఏఎస్), సివిల్ సప్లై డైరెక్టర్ విజయ సునీత(ఐఏఎస్), అసోం రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ లయ మాధురి(ఐఏఎస్) స్వామిని దర్శించుకున్నారు. వీరంతా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో వీరి పేరిట స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ త్రిమూర్తులు వీరికి అందజేశారు.


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సివిల్ సప్లై డైరెక్టర్ విజయ సునీత, అసోం ఫైనాన్స్ సెక్రటరీ లయ మాధురి దంపతులు

రేపటి నుంచి కొత్త రైల్వే టైం టేబుల్

పలు రైళ్ల సమయాల్లో స్వల్ప మార్పులు

తాటిచెట్లపాలెం: ఏటా అక్టోబర్ 1వ తేదీన వచ్చే కొత్త రైల్వే టైం టేబుల్లో భాగంగా విశాఖపట్నంలో బయలుదేరే పలు రైళ్ల సమయాల్లో స్వల్ప మార్పులుంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

- ప్రతి రోజూ ఉదయం 4.25 గంటలకు బయలుదేరే విశాఖపట్నం-రాయ్‌పూర్ (08528) స్పెషల్ అక్టోబరు ఒకటి నుంచి ఉదయం 6.30 గంటలకు బయలుదేరుతుంది. ఈ రైలు రోజూ ఉదయం 6.30 గంటలకు విశాఖపట్నం- కోరాపుట్(08546) రైలుతో కలిపి బయల్దేరుతుంది. రాయగడ నుంచి రెండు రైళ్లు విడివిడిగా ప్రయాణించనున్నాయి. తిరుగు ప్రయాణంలో రాయపూర్-విశాఖపట్నం (08527), కోరాపుట్- విశాఖపట్నం (08545) రెండూ విడివిడిగా విశాఖపట్నం చేరుకుంటాయి.
- జగదల్‌పూర్-హౌరా(18006)సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ ఒకటో తేదీ నుంచి ఉదయం 5.30 గంటలకు బదులుగా 5 గంటలకు బయల్దేరుతుంది.

తాత్కాలిక హాల్ట్‌లు కొనసాగింపు

విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లకు ఇటీవల ప్రయోగాత్మకంగా కల్పించిన తాత్కాలిక హాల్ట్‌లు కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- విశాఖపట్నం-నిజాముద్దీన్-విశాఖపట్నం (12803/12804) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం - లోకమాన్య తిలక్ టెర్మినస్ - విశాఖపట్నం(18519 / 18520) ఎక్స్‌ప్రెస్‌లకు దువ్వాడలో హాల్ట్ కొనసాగుతుంది.
- హతియా-బెంగళూరు-హతియా(12835/ 12836), టాటానగర్-బెంగళూరు- టాటానగర్ (12889/12890), హతియా-ఎర్నాకుళం-హతియా (22837/22838) రైళ్లకు బొబ్బిలిలో హాల్ట్ కొనసాగుతుంది
- విశాఖపట్నం-కోర్బా-విశాఖపట్నం(18517/ 18518) ఎక్స్‌ప్రెస్‌కు సింగపూర్ రోడ్‌లో హాల్ట్ కొనసాగుతుంది.
- రూర్కెలా-జగదల్‌పూర్-రూర్కెలా (18107/ 18108), భువనేశ్వర్-జగదల్‌పూర్ -భువనేశ్వర్(18447/18448), విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం(18514 / 18513) నైట్ ఎక్స్‌ప్రెస్‌లకు కోట్‌పర్ రోడ్‌లో హాల్ట్ కొనసాగుతుంది.
- హౌరా-జగదల్‌పూర్-హౌరా(18005/18006) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్‌కు దమన్‌జోడి, టికిరిలలో హాల్ట్ కొనసాగుతుంది.

కేకే లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో రైల్వే ట్రాక్‌పై పడిన కొండ చరియలను తొలగించే పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల గమ్యం కుదించినట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

- భువనేశ్వర్-జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ శని,ఆదివారాల్లో కోరాపుట్ వరకే నడుస్తుంది. జగదల్‌పూర్- భువనేశ్వర్ (18448) ఎక్స్‌ప్రెస్ శని, ఆదివారాల్లో కోరాపుట్ నుంచి బయలుదేరి భువనేశ్వర్ చేరుకుంటుంది.
- విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ శని, ఆదివారాల్లో కోరాపుట్ వరకే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ శని, ఆది, సోమవారాల్లో కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం- కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ శని, ఆది, సోమవారాల్లో విశాఖపట్నం నుంచి బయలుదేరి అరకు వరకు నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ శని, ఆది, సోమవారాల్లో అరకు నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.
- హౌరా- జగదల్‌పూర్(18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ శని, ఆదివారాల్లో టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. జగదల్‌పూర్-హౌరా (18006) ఎక్స్‌ప్రెస్ శని, ఆదివారాల్లో టిట్లాఘడ్ నుంచి బయలుదేరి హౌరా చేరుకుంటుంది.

గంగవరం పోర్టులో లోకోమోటివ్ సేవలు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో అధునాతన లోకోమోటివ్ సేవలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్పత్తి,ఉత్పాదికతల్లో వేగం పెంచేందుకు ఇవి సహకరిస్తాయని పోర్టు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. భారీ కంటైనర్లను తరలించడానికి, వేర్ హౌస్ సదుపాయాల మెరుగుదలలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడించారు. వినియోగదారులకు వేగవంతంగా సేవలు అందించేందుకు సమర్థవంతమైన పరిశ్రమను నడిపేందుకు పోర్టు యాజమాన్యం అత్యధిక పెట్టుబడులు పెడుతోందన్నారు.

సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌కు 27 మంది విశాఖ అథ్లెట్లు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: సౌత్‌జోన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏపీ జట్లను ఎంపిక చేశారు. వీరిలో విశాఖ నుంచి 27 మంది రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించారు. రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల పోటీలు నాగార్జున యూనివర్సిటీలో ఇటీవలే ముగిసాయని జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి నారాయణరావు తెలిపారు. సౌత్‌జోన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ అక్టోబర్ 15 నుంచి మూడు రోజుల పాటు వరంగల్‌లో జరగనుంది. 20 ఏళ్ల లోపు జూనియర్ మెన్ విభాగంలో ఎన్.సింహాచలం, వి.కిరణ్‌కుమార్, టి.శ్యామ్యూల్ రాజ్, వుమెన్‌లో బి.కరుణశ్రీ, కె.సాధన, వై.గుణశ్రీ ఎంపికయ్యారు. అండర్- 18 యూత్ బాలురలో పి.పవన్‌కుమార్, ఎస్.లోహిత్, పి.వెంకట్ గౌతమ్, గోపాలకృష్ణ, ఎస్.లక్ష్మణ, బాలికల్లో పి.త్రిష, కేపీజీ కుమారి, ఎంఎస్ సాయి వర్షిణి, వై.భాను స్థానం సాధించారు. అండర్-16 బాలురలో డి.శేషు, పి.జశ్వంత్, పి.రాజ్ శేఖర్, వి.సింహాచలం, బాలికల్లో బి.హాషిత, అండర్-14 బాలురలో వరప్రసాద్, బాలికల్లో బి.ప్రవల్లిక, జి.తేజస్విని, ఎన్.బిందు హాసిని, ఓఎస్ సహశ్రిక, పి.నందిని ఈ మీట్‌లో పాల్గొనున్నారు.

బీఎస్ రాజుకు 'బాలి' పురస్కారం

సీతంపేట: కార్టూనిస్ట్‌గా, చిత్రకారుడిగా బాలి తన అద్భుత కళతో జన బాహుళ్యాన్ని ఆకట్టుకున్నాడని సీనియర్ జర్నలిస్ట్ మంగు రాజగోపాల్ అన్నారు. విశాఖ సంస్కృతి, విశాఖ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం చిత్రకారుడు బాలి జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలి స్మారక పురస్కారాన్ని ప్రముఖ కార్టూనిస్ట్ బీఎస్ రాజుకు అతిథులు చేతులు మీదుగా అందజేశారు. విశాఖ సంస్కృతి సంపాదకులు శిరేల సన్యాసిరావు , సుంకరరావు, విశాఖ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి అడపా రామకృష్ణ, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.


పురస్కారం స్వీకరిస్తున్న కార్టూనిస్ట్ రాజు

గుండె ఆరోగ్యానికి శారీరక శ్రమ అవసరం

ఆరిలోవ: గుండె సంబంధిత వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని అపోలో ఆస్పత్రి కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ బారువ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అపోలో సీవోవో రామచంద్రరావు ఆధ్వర్యంలో శుక్రవారం బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. సాయంత్రం ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్డియాలజిస్టులు త్రివేది, చక్రవర్తి, శశాంక్, రవికాంత్ తదితరులతో కలసి గుండె సంబంధిత వ్యాధులు-వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ బారువ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి వృద్ధుల వరకు గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారన్నారు. బీపీ, మధుమేహం ఉన్నవారితో పాటు జన్యుపరమైన సమస్యలు ఉన్న వారిలో ఎక్కువగా ఈ వ్యాధులు వస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాధులకు గురైన వారు ఆహార అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం, ధ్యానం చేయడం, నడక, ఆటలు అవసరమని వివరించారు. 20 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆరు నెలల నుంచి ఏడాది కాలవ్యవధిలో ఒక సారి గుండె పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇందుకోసం అపోలోలో రూ.999 నుంచి రూ.4,999 వరకు ప్యాకేజీ ఉందన్నారు. అక్టోబర్ 29 వరకు ఈ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న కార్డియాలజిస్ట్ బారువ

హనీ గ్రూప్‌కు ప్రతిష్టాత్మక టైమ్స్ బిజినెస్ అవార్డు

దొండపర్తి: రియల్ ఎస్టేట్ దిగ్గజం హనీ గ్రూప్‌నకు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. 'బెస్ట్ క్వాలిటీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్' కేటగిరీలో టైమ్స్ బిజినెస్ అవార్డు వరించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హనీ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముక్క ఓబుల్‌రెడ్డి ప్రముఖ సినీ నటి శ్రియా శరణ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత నాణ్యతతో కూడిన నిర్మాణాలతో ప్రజలకు చేరువైనట్లు చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని ప్రాజెక్టు చేపట్టి, గృహ నిర్మాణం, కొనుగోలును సులభతరం చేసి వేలాది మంది సొంతింటి కలను సాకారం చేయడానికి అడుగులు వేస్తామని ఓబుల్ రెడ్డి తెలిపారు.



సినీ నటి శ్రియ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ముక్క ఓబుల్‌రెడ్డి

2 నుంచి కాశ్మీర్ యువ సమ్మేళనం

బీచ్‌రోడ్డు: మహా విశాఖ నగరంలో కాశ్మీర్ యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర (ఎన్‌వైకే) ఉమ్మడి జిల్లా అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 7 వరకు నిర్వహించే సమ్మేళనంలో 120 మంది కాశ్మీర్ యువతీ యువకులు పాల్గొంటున్నారని చెప్పారు. ఎన్‌వైకే పరిపాలనాధికారి అల్లం రాంప్రసాద్‌తో కలిసి యూత్ హాస్టల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మహేశ్వరరావు వివరాలు వెల్లడించారు. కాశ్మీరీ యువతకు ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, పథకాల గురించి యువ సమ్మేళనంలో వివరిస్తామన్నారు. కాశ్మీర్‌లోని అనంతనాగ్, కుప్వారా, బారాముల్లా, బుద్గం, శ్రీనగర్, పుల్వామా, జిల్లాల నుంచి 120 మంది యువత, 12 మంది టీమ్ లీడర్లు విశాఖ వస్తున్నట్లు ఆయన తెలిపారు. సమ్మేళనంలో భాగంగా విశాఖపట్నంలోని ముఖ్యమైన ప్రదేశాలను సందర్శిస్తారని తెలిపారు. కాశ్మీర్ లోయలోని యువకుల్లో జాతీయ ఐక్యత, సమగ్రత, శాంతి ప్రతిపాదకులుగా వ్యవహరించేలా దిశా నిర్దేశం చేయడం సమ్మేళనం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కాశ్మీర్ లోయలోని పర్యాటకం, వంటకాలు, సంస్కృతి, హస్తకళలు, ఇతర ఉత్పత్తుల సమాచారాన్ని దేశంలోని ఇతర ప్రాంతాల వారితో పంచుకోవడానికి సమ్మేళనం దోహదపడుతుందని మహేశ్వరరావు చెప్పారు

దేశ వ్యాప్తంగా సీపీఆర్ శిక్షణ శిబిరాలు

ఎంవీపీ కాలనీ: ఆకస్మిక గుండెపోటు మరణాల నియంత్రణకు మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సీపీఆర్ (కార్డియో - పల్మనరీ రిససిటేషన్) శిక్షణ అందించనున్నట్లు ఎంవీపీ కాలనీలోని ఆస్పత్రి కార్డియాలజీ విభాగ డైరెక్టర్ హేమంత్ కుమార్ బెహర తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ఆస్పత్రిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు, ఆస్పత్రి వర్గాలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా ఏటా ఆకస్మిక గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయన్నారు. వీరిలో ప్రధానంగా 50 కంటే తక్కువ వయసు వారే ఉంటున్నారన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లే ఇందుకు కారణమన్నారు. ఈ నేపథ్యంలో మరణాల నియంత్రణకు మెడికవర్ ఆధ్వర్యంలో సీపీఆర్ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇండియా అనిల్ కృష్ణ, కరుణాకర్ పాల్గొన్నారు.


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న మెడికవర్ వైద్యులు

వైఎస్సార్ సీపీ క్లస్టర్/మండల అధ్యక్షుల నియామకం

దొండపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో వైఎస్సార్ సీపీ క్లస్టర్/మండల అధ్యక్షులను నియమించారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు సంబంధించి 31 మందిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

నియోజకవర్గం	క్లస్టర్/ మండలం	పేరు
గాజువాక	క్లస్టర్-1	ధర్మాల శ్రీనివాసరావు
గాజువాక	క్లస్టర్-2	రాజాన వెంకటరావు
గాజువాక	క్లస్టర్-3	షేక్ మహమద్ గౌస్
గాజువాక	క్లస్టర్-4	బొడ్డ గోవింద్
విశాఖ తూర్పు	క్లస్టర్-1	గొలగాని శ్రీనివాస్
విశాఖ తూర్పు	క్లస్టర్-2	ఉమ్మిడి దాసు
విశాఖ తూర్పు	క్లస్టర్-3	మధుపాద రవి
విశాఖ తూర్పు	క్లస్టర్-4	మొల్లి అప్పారావు
విశాఖ ఉత్తర	క్లస్టర్-1	జి.వి.రమణిరెడ్డి
విశాఖ ఉత్తర	క్లస్టర్-2	బానాల శ్రీనివాసరావు
విశాఖ ఉత్తర	క్లస్టర్-3	కటుమూరి సతీష్
విశాఖ ఉత్తర	క్లస్టర్-4	అల్లు శంకరరావు
విశాఖ ఉత్తర	క్లస్టర్-5	పైడి కృష్ణారావు
విశాఖ పశ్చిమ	క్లస్టర్-1	కలిదిండి బద్రీనాథ్
విశాఖ పశ్చిమ	క్లస్టర్-2	అంగ రాంప్రసాద్
విశాఖ పశ్చిమ	క్లస్టర్-3	జియ్యాని శ్రీధర్
విశాఖ పశ్చిమ	క్లస్టర్-4	బెహరా భాస్కరరావు
విశాఖ దక్షిణ	క్లస్టర్-1	బాపు ఆనంద్
విశాఖ దక్షిణ	క్లస్టర్-2	కర్రి సీలకాంతారావు
విశాఖ దక్షిణ	క్లస్టర్-3	కొల్లి సింహాచలం
విశాఖ దక్షిణ	క్లస్టర్-4	పీతల వాసు
భీమిలి	ఆనందపురం	బంక సత్యనారాయణ
భీమిలి	భీమిలి	గాడు శ్రీను
భీమిలి	పద్మనాభం	కోరాడ లక్ష్మణరావు
భీమిలి	క్లస్టర్-1	ఉప్పాడ నాగేశ్వరరావు
భీమిలి	క్లస్టర్-2	బూర రామకృష్ణ
భీమిలి	క్లస్టర్-3	పోతిన సురేష్
భీమిలి	క్లస్టర్-4	బొట్టా అప్పలరాజు
భీమిలి	క్లస్టర్-5	పోతిన శ్రీనివాసరావు
భీమిలి	క్లస్టర్-6	గుడ్ల పోలిరెడ్డి
భీమిలి	క్లస్టర్-7	కొలుసు ఈశ్వరరావు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మర్రిపాలెం: చీరతో చెట్టు కొమ్మకు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కంచరపాలెం పరిధిలో జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. తిక్కవానిపాలెం వద్ద పైడిమాంబ ఆలయ సమీపంలోని మైదానంలో శుక్రవారం చెట్టు కొమ్మకు ఓ వ్యక్తి మృతదేహం వేలాడుతూ ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని కంచరపాలెం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుంది. సీఐ ఎస్ సాయి, ఎస్‌ఐ రవికిశోర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సచివాయ వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అతను ఎవరు? ఆత్మహత్యకు గల కారణాలు వంటి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.


చెట్టుకు వేలాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి